క్లుప్తంగా

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ


పర్సు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఉక్కునగరం: బస్సులో ప్రయాణించి దిగిన సమయంలో పర్సు పోగొట్టుకున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి దాన్ని అందజేసి ఆర్టీసీ సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి షబ్బీర్ బాషా శనివారం టౌన్ షిప్‌లోని సెక్టార్–5 బస్టాప్‌లో 38కే బస్సు ఎక్కి కూర్మన్నపాలెంలో దిగిపోయారు. బస్సు కండక్టర్ కె.ఎస్. రాజు, డ్రైవర్ ఎం.ఎల్. రావులు బస్సులో పర్సును గుర్తించి అందులో నగదు రూ. 4210, ఏటీఎం, ఆధార్ కార్డులతో పాటు ముఖ్యమైన పత్రాలను గుర్తించారు. ఆ విషయాన్ని వారు డిపోకు తెలియజేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ జి. సత్యారావు వివరాలు పరిశీలించి షబ్బీర్ బాషాకు తెలియజేశారు. డిపో సిబ్బంది ద్వారా పర్సు అందజేశారు. షబ్బీర్ బాషా ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

'సమ్మెకు మద్దతు ఇవ్వండి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్లకు లేఖలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో గతంలో 644 మంది, ప్రస్తుతం 1504 మంది వెరసి ఇప్పటి వరకు మొత్తం 2148 మంది కార్మికులను తొలగించారన్నారు. మొత్తం 5600 మందిని తొలగించి తీరుతామని యాజమాన్యం ప్రకటిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నామని తెలిపారు. దీనికి మద్దతు ఇవ్వడం ద్వారా కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధిని కాపాడాలని అఖిలపక్ష నాయకులు నమ్మి రమణ, సోమరాజు, గురునాథ్, వెంకటరమణ, యు. అప్పారావు కోరారు.

అభినందన


ఎం.కె.శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న పోవా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.కె.శ్రీనివాస్‌ను శనివారం పంచవటీ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పోవా) ప్రతినిధులు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. పోవా అధ్యక్షుడు పి.చిన్నారావు మాట్లాడుతూ ఎం.కె.శ్రీనివాస్ పోవా లీగల్ అడ్వైజర్‌గా సేవలను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోవా కార్యదర్శి వై.రామ్మోహనరావు, ప్రతినిధులు విశ్వనాథ్, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2 లక్షల విరాళాలు


దాత అప్పలరత్నంకి బాండ్ అందజేస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక దరి శ్రీనగర్ ప్రాంతానికి చెందిన ఎం.అప్పలరత్నం అనే దాత లక్ష రూపాయల విరాళాన్ని, హైదరాబాద్‌కి చెందిన ఎస్.అప్పారావు అనే దాత లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్లు అందించారు.

12న హనుమాన్ శోభా యాత్ర

మహారాణిపేట: ఈనెల 12న నగరంలో హనుమాన్ శోభా యాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ కోసం హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగర పరిధిలో ఐదు ప్రాంతాల నుంచి ప్రణాళిక తయారు చేశారు. పెందుర్తి, గాజువాక, మారియట్ హోటల్, ఆనందపురం, పోస్టాఫీసు తదితర ప్రాంతాల గుండా సాగే ర్యాలీ సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు చేరుతుంది. అక్కడి నుంచి హనుమాన్ శోభా యాత్ర మొదలై కాళీమాత దేవాలయం వరకు సాగుతుంది.

నవమి శోభ

సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం • ముస్తాబైన రామాలయాలు




నాతయ్యపాలెంలోని రామాలయం


గుడివాడ అప్పన్నకాలనీలోని రామాలయం

శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలు సీతారాముల కల్యాణానికి ముస్తాబయ్యాయి. వీధులన్నీ రంగు రంగుల విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లతో కళకళలాడుతున్నాయి. ప్రత్యేకంగా కల్యాణ వేదికలు వేశారు. అరటిచెట్లతో స్వాగత ద్వారాలు, మామిడాకులు, పూల తోరణాలతో కళకళలాడుతున్నాయి. ఆదివారం ఉదయం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ తలంబ్రాలు సిద్ధం చేశారు. మరింకెందుకు ఆలస్యం రారండోయ్ రాములోరి కల్యాణం చూసొద్దాం.

అక్కిరెడ్డిపాలెం: శ్రీరామనవమి ఉత్సవాలకు రెండు రోజుల నుంచి ఆలయ ప్రతినిధులు సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. రాములోరి కల్యాణం నిర్వహించడానికి వీలుగా ప్రత్యేక వేదికలు వేశారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని వినాయక సాయి సుబ్రమణ్యేశ్వర వేణుగోపాల ఉమా రామలింగేశ్వర సహిత సీతారామాలయంలో విస్తత ఏర్పాటు చేశారు. అలాగే షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో సీతారాముల కల్యాణం నిర్వహణకు దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు కల్యాణం తిలకించేందుకు టెంట్లు, కుర్చీలు వేశారు.

• హరిజనజగ్గయ్యపాలెంలో అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామాలయంలో, నాతయ్యపాలెం కోదండ రామాలయంలో, మింది రామాలయంలో, గుడివాడ అప్పన్నకాలనీలోని రామాలయంలో, తుంగ్లాంలోని విజయ రాఘవ స్వామి ఆలయంలో, రాంనగర్‌లోని రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయాల్లో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.


అక్కిరెడ్డిపాలెంలో సీతారాముల కల్యాణానికి చేసిన ఏర్పాట్లు

15 వరకు పెంటమాంబ ఉత్సవాలు


ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 15 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి సత్యారావు చెప్పారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం వారు ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేసి పండగ వివరాలను వెల్లడించారు. అమ్మవారి ప్రధాన పండగను ఈ నెల 14న వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. ముందు రోజు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి అమ్మవారికి విశేష పూజలు చేసి, భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 15న అమ్మవారి అనుపు ఉత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో యేల్లేటి శ్రీనివాసరావు, గంట్యాడ పైడిరాజు, మొల్లి రమణ, పిట్ట కుంచారావు, శ్రీరామూర్తిత, అప్పారావు, అప్పలరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి, గోవిందరెడ్డి, హరీష్, నీలాపు పరదేశి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు


సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

అగనంపూడి: విశాఖ ఉక్కు విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ సమావేశంలో వృద్ధులకు గుర్తింపు కార్డులు అందించారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం శనివారం జీవీఎంసీ 79వ వార్డు పాత దానబోయినపాలెం రామాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు బి.భాస్కరరాజు, జి.బోసు బాబు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులకు కల్పించిన ఆరోగ్య బీమా పాలసీ, వాటి ప్రయోజనాలు వివరించారు. ఈపీఎస్–95 అధిక పింఛన్ డిమాండ్‌పై చర్చించారు. తర్వాత వయో వృద్ధులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గుడే సుశీలా గజేంద్రరావు, బత్తుల కాళిదాస్, వై.పోలిరెడ్డి, విందుల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

1514వ రోజుకు చేరిన ఉక్కు పోరాట దీక్షలు


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1514వరోజుకు చేరాయి. దీక్షల్లో ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ అదినారాయణ మాట్లాడుతూ కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని.. ఉద్యోగులకు నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ ఆలెసా, మంత్రి రవికిరణ్, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి రూ.50 వేల సాయం


బాధితుడు శ్రీనివాస్‌కు రూ.50 వేలు అందిస్తున్న శిష్టకరణ ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడికి చెందిన క్యాన్సర్ బాధితుడు జగ్గుమంత్రి శ్రీనివాస్‌కు శనివారం శిష్టకరణ ఫౌండేషన్ ఆర్థిక భరోసా కల్పించింది. కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావుకు గతనెలలో శస్త్ర చికిత్స చేశారు. దీంతో శ్రీనివాసరావు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న శిష్టకరణ ఫౌండేషన్ సభ్యులు విరాళాలు సేకరించి రూ.50 వేల నగదును శ్రీనివాసరావు కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మానాపురం సురేష్‌కుమార్, మారడం రవికాంత్, వేణు వీరబాబు మాట్లాడుతూ బాధితుడు కోలుకొనే వరకు ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రఘుపాత్రుని నాగరాజు పట్నాయక్, బెహరా శ్రీనివాస్ పట్నాయక్, అమరాం విశ్వేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు శేఖరమంత్రి శ్రీనివాస్ పట్నాయక్, కూర్మన్నపాలెం ప్రతినిధి మానాపురం శ్రీనివాస్, హైదరాబాద్ లేఖ టీమ్ ప్రతినిధి డి.నరేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సత్కారం


వెంకటరావు దంపతులను సత్కరిస్తున్న సాయి భజన మండలి ప్రతినిధులు

అగనంపూడి: విశాఖ ఉక్కులో స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగి, సాయి భక్తులు కొల్లి వెంకటరావు జయ దంపతులును అగనంపూడి శ్రీసత్యసాయి భజన మండలి ఘనంగా సత్కరించింది. అగనంపూడిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ఉక్కునగరం కన్వీనర్ జి.రామకృష్ణ, బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాల పాటు ఎటువంటి రిమార్క్ లేకుండా సేవలు అందించడంతో పాటు చిత్ర కళాకారునిగా వివిధ కళలను పోషించిన వెంకటరావు సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో విందుల రమణమ్మ, వెంకట పద్మలత, రామారావు దంపతులు, పి.లక్ష్మీరాజు దంపతులు, సీహెచ్ ప్రసాద్ లక్ష్మీ దంపతులు, పి.గోవిందరావు పార్వతీ దంపతులు, బి.వి.పద్మా సుబ్బారావు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలపై సమీక్ష

కూర్మన్నపాలెం: సీతారామ లింగేశ్వర ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు 87 వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ తెలిపారు. శనివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నవమి ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ సేవలు మరువలేం


బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తిప్పల నాగిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు


నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, కరణంరెడ్డి నరసింగరావు

పెదగంట్యాడ: భారత మాజీ ఉప ప్రధాని, దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేమని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలి వద్ద జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో ఏడు మంత్రి పదవులు చేపట్టి వాటికి వన్నె తెచ్చిన మహనీయుడు అని సేవలు కొనియాడారు. గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, గంట్యాడ గోవిందరాజు, పల్లా చినతల్లి, కొయ్య భారతి, ధర్మాల శ్రీను, మంత్రి శంకరనారాయణ, గొందేశి మహేశ్వరరెడ్డి, బొడ్డ గోవింద్, అండిబోయిన అప్పారావు, గొందేశి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

• పెదగంట్యాడ జగ్జీవన్‌రామ్ కాలనీలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, రాజేష్, సురేష్, పెంటారావు, మనోహర్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

• మదర్ థెరిసా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జాగరపు శ్రీను ఆధ్వర్యంలో కోరాడ కూడలి వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


భెల్‌లో బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సంస్థ ఈడీ సుబ్రమణ్యం


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాగరపు శ్రీను తదితరులు

ఆదర్శప్రాయుడు జగ్జీవన్ రామ్

అక్కిరెడ్డిపాలెం: బాబూ జగ్జీవన్ రాం భావితరాలకు ఆదర్శనీయుడని భెల్ (హెచ్‌పీవీపీ) ఈడీ జి.సుబ్రమణ్యం అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని శనివారం జగ్జీవన్ రామ్ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ దేశ ఉప ప్రధానిగా పని చేసిన ఆయన అనేక సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. వెనుక బడిన వార్గల నుంచి వచ్చిన ఆయన వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశాడని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుబ్రమణ్యం, ఏజీఎం, హెచ్‌ఆర్ ఎస్.లీల, జీఎం ఎం.ఎస్.శ్రీనివాసరావు, ఏజీఎం ప్రొడక్షన్ నిరాకర్ ముండాలను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు కొల్లి దేముడు, బొండ బాబూరావు, పి.వి.ఎస్.రాజు, జి.కిరణ్, బి.రవీంద్రబాబు, టెక్కలి భాస్కరరావు, సీటూ నాయకులు జి.టి.పి. ప్రకాష్, ఇంటక్ నాయకులు సీహెచ్.మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు కర్మాగారం మాజీ ఈడీ వర్క్స్ డి.వసంతరావుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమకోసం మహోన్నతమైన సేవలు అందించారని కొనియాడారు. అందువల్లే జగ్జీవన్‌రామ్ బడుగుల ఆశాజ్యోతిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు ,పెద్దిరాజు, పైడిరాజు, అప్పారావు, శరత్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

గాజువాక: గాజువాక న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్ష కార్యదర్శులుగా ఇటీవల ఎన్నికైన యశోధర వేదమణి, డి.చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆ పదవుల్లో కొనసాగిన బి.ప్రభాకరరావు, టి.పుల్లయ్యనాయుడు కొత్త సారథులకు బాధ్యతలు అప్పగించారు. తమ బాధ్యతల నిర్వహణలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోశాధికారి ఇ.గిల్బర్ట్, మాజీ కోశాధికారి టి.కిషన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల రాస్తారోకో


కూర్మన్నపాలెంలో ఆందోళన చేస్తున్న కార్మికులు


మోహరించిన పోలీసులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగించడాన్ని నిరసిస్తూ కూర్మన్నపాలెంలో శనివారం సాయంత్రం కార్మిక సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళన కారులను నిలువరించారు. కార్మిక సంఘాల నాయకులు మంత్రిరాజశేఖర్, ఆదినారాయణ గంగారామ్ తదితరులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంకుశ వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్టులు, ఇతర పేర్లు చెప్పి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం మానుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆప్కాస్‌లో కొనసాగించాలి


పారిశుధ్య కార్మికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల్ని ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించాలనే ఆలోచన, ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ శాఖామంత్రికి అందివ్వనున్న వినతి పత్రంపై కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. 85,86,88 వార్డుల్లోని కాంట్రాక్ట్ కార్మికులు,పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉండగా వారి వద్దకు వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య, నీటి సరఫరా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిచొద్దన్నారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, పద్మ, దివ్య, అరుణ, సత్యవతి, నాగరాజు, సూర్యకాంతం, నడిపల్లి రాజు, కొండలరావు పాల్గొన్నారు.